రూ.10వేల పింఛను అందజేత

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని సూకూరు పంచాయతీ చట్రాయిపుట్టు గ్రామంలో సికిల్ సెల్ ఎనిమియా బాధితుడు గొల్లోరి కృష్ణకు నూతన పెన్షన్ రూ.10000 శనివారం స్థానిక సర్పంచ్ సత్యవతి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌తో మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యం పట్ల తగు జాగ్రతలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధనసాని మురళి, పూర్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ కృష్ణ, ఆశ కార్యకర్త బృంద, వాలెంటీర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న సర్పంచ్

నినాదాలు చేస్తున్న అఖిల పక్ష పార్టీలు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట:గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై మండల కేంద్రంలో అఖిలపక్షం పార్టీలు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ చేపట్టి వారపు సంతలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, ఏజెన్సీ లో 1/70 చట్టం సవరణ చేస్తే పెట్టుబడులు వస్తాయని..స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికాదన్నారు. ఏజెన్సీ లో టూరిజం ద్వారానే అభివృద్ధి జరుగుతుందనే తప్పుడు మాటలు మాను కోవాలన్నారు. 1/70చట్టం సవరణ చేసి ఏజెన్సీ అడవుల్లో బాక్సైట్, లేటరైట్, మైకా, వజ్రాలు వంటి ఖనిజాలు, బహుళజాతి కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన ఈ మాటల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉన్నారనే అనుమానం కలుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో టీడీపీ కూటమి నాయకులు వెంటనే స్పందించి 1/70 చట్టం రక్షణకు పూనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ, సీపీఎం నేత సూడిపల్లి కొండలరావు, సీపీఐ నేత, గిరిజన సమైక్య నాయకులు రాధాకృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాచిపెంట చిన్న స్వామి, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నేతల పెనుమల కాంతి రాజు, వైసీపీ నాయకులు, సురేష్ కుమార్, జిల్లా రైతు విభాగం మాజీ నాయకులు విశ్వేశ్వర రావు, జిల్లా నాయకులు గండేరు చిన సత్యం, సర్పంచ్ పెనుమల రంజీత్ కుమార్, సీపీఎం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, గిరిజన సంఘం మండల నాయకులు తడిగిరి, కొంతిలి వైస్ సర్పంచ్‌లు కిల్లో రామారావు, కృష్ణ మూర్తి, నాయకులు కొర్ర అప్పారావు, ఆదివాసీ సేన అరకు అధ్యక్షుడు చుంచు రాజు బాబు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స శనివారం ఒక ప్రకటనలో ఏర్కొన్నారు. పి.ఎం జన్మన్ పథకంలో పి.వి.టి.జిల ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు పెంచాలని కోరినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. పివిటి.జిలపై సవతి తల్లి ప్రేమ మాత్రమే చూపిస్తున్నట్లు మోడీ పాలన ఉందన్నారు. గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా కేటాయింపులు చేయాల్సిన 8 శాతం ప్రకారం గిరిజన సబ్ ప్లాన్‌కు 3,54,574 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం (2.36) శాతం 1,29,249 మాత్రమే కేటాయించారన్నారు. ఇందులోనే గిరిజన వ్యవహారాల శాఖకు గత ఏడాది 13,000 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్లో అదనంగా కేవలం 1925 కలిపి 14,925 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పోరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేసిందని అన్నారు. ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులను మరింత ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం గతేడాది 240 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం 2 కోట్లు మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమో కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.ఐ.టి.డి.ఏ ను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు.ఎన్నికల ముందు హడావిడిగా కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీని నిర్మించి ప్రారంభిస్తామని ప్రకటించారని, ఈ బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా గిరిజనులను మోసం చేసిందని విమర్శించారు.

పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో గతంలో ఎన్నడు లేని విధంగా ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఐటిడిఎలకు నిధులు కేటాయింపు లేకపోవడంతో నేటికీ డొలిమోతలే శరణ్యమౌతున్నాయని విమర్శించారు.

ఉత్తమ పురస్కారం చూపుతున్న జెన్‌కో అధికారులు

సీలేరు కాంప్లెక్స్‌కు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జల విద్యుత్ కేంద్రాల్లో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి చేయడంతో ఉత్తమ పురస్కారం అవార్డు సాధించినట్లు ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు స్థానిక జల విద్యుత్ కేంద్రంలో శనివారం ఇంజనీర్లు, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారి ఆధ్వర్యంలో అవార్డును జల విద్యుత్ కేంద్రంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈఈ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సమస్యలు అధిగమించి అవార్డుని సాధించామని చెప్పారు. విద్యుత్ రంగాల్లో సీలేరు కాంప్లెక్స్ 2229 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా సెంట్రల్ విద్యుత్ అథారిటీ నిర్దేశించగా, సీలేరు కాంప్లెక్స్ అన్ని జల విద్యుత్ కేంద్రాల్లో ఓవరాల్‌గా 2308 మిలియన్ యూనిట్లు అంటే లక్ష్యాన్ని మించి 39 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి సాధించడంతో అవార్డు దక్కించుకున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్ వరకు సమిష్టి కృషి వలన ఈ అవార్డు సాధ్యమైందన్నారు. కాంప్లెక్స్ పరిధిలో ఇంజనీర్లు ఉద్యోగులు కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులకు మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా అందరి కృషితో అవార్డు సాధిస్తామని రాజేంద్రప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఏడిఇలు అప్పారావు, శ్రీధర్, కుమార్, సత్యనారాయణ, సుమన్, ఎఈఈలు నాగబాబు, బాషా, జూనియర్ ఇంజనీర్ శ్రీధర్, విజిలెన్స్ సిబ్బంది సుధాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కృషి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్- ఘనంగా రెండో రోజు అరకు చలి ఉత్సవ్

ప్రజాశక్తి- అరకులోయ: ఆంధ్రా ఊటీలో గిరిజన సంస్కృతితో సుస్థిరమైన పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. అందాల అరకులోయ పూల బొకేలను రాష్ట్రానికి తొలి పరిచయం చేస్తామని చెప్పారు. చలి అరకు ఉత్సవం రెండవ రోజున స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పార్కుకు విళ దగల్ అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అరకు ప్రాంతంలో పూల పెంపకానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. బొకెల తయారీలో నైపుణ్యం ఉన్నవారిని తీసుకురావడం జరిగిందని అన్నారు. వారితో గిరిజనులకు తగిన శిక్షణ అందిస్తామని చెప్పారు.బొర్రా కేవ్ నుండి డిగ్రీ కళాశాల మైదానం చలి ఉత్సవ్ వేదిక వరకు సైక్లింగ్ పోటీని ప్రారంభించామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా సైకిల్ రైడ్ నిర్వహించామని పేర్కొన్నారు. అరకు యువకుడు ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు.అరకు బ్రాండ్ సైకిలిస్ట్ గా తయారై రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ఆయన ఏజెన్సీ కి మంచి పేరుతెస్తాడన్నారు. 2వ తేదీన సుంకర మెట్ట నుండి గాలికొండ వ్యూ పాయింట్ వరకు ట్రెక్కింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఫ్యాషన్ షో నిర్వహిస్తామని చెప్పారు. మూడవ రోజు వివిధ కార్యక్రమాలు, ఫోక్ సింగర్ మంగ్లీ పాటలు పాడతారని తెలిపారు. సైకిల్ రైడ్ విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ. పి. అగర్వాల్ మొదటి స్థానం, అరకు లోయ మండలం దండబాడు గ్రామానికి చెందిన పాంగీ అజయ్ ద్వితీయ, విశాఖ కు చెందిన ప్రియదర్శిని తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్సవ్ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు వేసిన వివిధ సంస్కృతిక కళ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సబ్ డి.ఎఫ్.ఓ ఉమా మహేశ్వరి, ఎం.పి.డి.ఓ లవరాజు, డిఎల్ పివో పి.ఎస్.కుమార్, పి.ఆర్. డి.ఈ రామం తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల అద్భుత ప్రదర్శన

కళాకారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న కలెక్టర్, జెసి, పిఒ

పట్టుబడిన గంజాయి, నిందితునితో పోలీసులు

58 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-సీలేరు : కారులో అక్రమ తరలిస్తున్న 58 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జీకే వీధి సీఐ వరప్రసాద్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధిలో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, ఆ సమయంలో వేగంగా వస్తున్న కారును నిలుపుదల చేసి తనిఖీలు చేశారు. కారులో ఉన్న 58 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకొని, గంజాయి తరలిస్తున్న సీలేరుకు చెందిన పెద్దపూడి చిన్నబాబు, మరో 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న మరో బాలుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ తరలించారు. వారిని విచారించగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు రాసబేడ గ్రామంలో గంజాయి కొనుగోలు చేసినట్లు చెప్పారు. నిందితుల నుండి గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, రూ.320 నగదు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చింతపల్లి:రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లోని సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీటికి సంబంధించి పరిశోధనా స్థానం ఏడిఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యుడు ఆళ్ల అప్పలస్వామి అందించిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులు రెండు పతకాలు సాధించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వంతల అమృత సోలో సింగింగ్ కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో ప్రధమ బహుమతి సాధించగా, గ్రూప్ డాన్స విభాగంలో విద్యార్థినిలు ప్రదర్శించిన దింసా నృత్యానికి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి దక్కినట్లు ఏడిఆర్ అప్పలస్వామి తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఐదేళ్ల పాలనలో అభివృద్ధి ఏదీ?: టిడిపి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:వైసిపి అయిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు విమర్శించారు. శనివారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడ్లారు. పెదలబుడును దత్తత తీసుకుని అభివృద్ధి పరిచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతోందన్నారు. గిరిజన సంప్రదాయలను సగర్వంగా తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం చలి ఉత్సవాలను నిర్వహిస్తుంటే వైసిపి ప్రజా ప్రతినిధులు అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. అయిదేళ్లుగా నియోజకవర్గ గ్రామాల అభివృద్ధిని మరిచిన ప్రజా ప్రతినిధులు ఉత్సవాలపై రాజకీయం చేయడం సరికాదన్నారు. గిరిజన చట్టాలపై గత ప్రభుత్వంలో గిరిజన ఎమ్మెల్యేలు నోరు మెదపలేదన్నారు. జీఓ 3రద్దు ప్రక్రియను అడ్డుకోకుండా చేసిన ఘనత వైకాపా ప్రజా ప్రతినిధులకే దక్కిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు మానుకుని అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీయూసీ అరకు పార్లమెంట్ కోశాధికారి స్వామి, కూటమి నాయకులు గంగాధర్, సింహాద్రి, చంటి, శంకర్రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

జాబ్ మేళాకు విశేష స్పందన

భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత

మాట్లాడుతున్న డిఎస్‌పి సాయి ప్రశాంత్

జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరైన నిరుద్యోగ యువత

ప్రజాశక్తి-రంపచోడవరం : పోలీసు శాఖ ఆధ్వర్యంలో రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలకు మంచి స్పందన లభించింది. సుమారు 350 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఇన్నో సోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల వారు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహించినట్లు చెప్పారు. మైదాన ప్రాంతాల్లో ఉండే విద్యావంతులైన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కడ ఉంటాయి, వాటిని ఎలా పొందాలో అవగాహన ఉంటుందని, కాని గిరిజన ప్రాంతాలలో నివసించే యువతీ యువకులకు అవగాహన తక్కువ ఉండటం వల్ల వారు ఎక్కువ శాతం నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించే సదుద్దేశంతో విశాఖ డిఐజి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహిస్తామన్నారు. గిరిజన ప్రాంతంలోని నిరుద్యోగ యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు పోలీస్ శాఖ తమ వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభ దృశ్యాలు

నెల్లూరులో శనివారం ప్రారంభమైన సిపిఎం రాష్ట్ర మహాసభలో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లాల నుండి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి నివేదికపై జిల్లాల వారీగా చర్చించి, మహాసభలో నివేదించారు.

మాట్లాడుతున్న అల్లూరి ప్రతినిధి త్రినాథ్, రంపచోడవరం జిల్లా ప్రతినిధులు సంతోష్‌కుమార్, పల్లపు వెంకట్

కార్యదర్శి నివేదికపై చర్చిస్తున్న ఎఎస్‌ఆర్ రంపచోడవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రతినిధులు

నందిగామలో తొలగించని తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీ

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- నందిగామలో టిడిపి ఫ్లెక్సీలు తొలగించని అధికారులు

ప్రజాశక్తి-ఎటపాక : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి గ్రామాల్లో తెలుగుదేశం జెండాలు, ఫ్లెక్సీలను మాత్రం అధికారులు తొలగించలేదు. మండలంలోని నందిగామ గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీ ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా అదే గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు, టీడీపీ ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నక్కబందలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీరి మండలం దేవరాపల్లి సచివాలయ పరిధి నక్కబంద గ్రామంలో జీకే వీధి పిహెచ్సి వైద్యాధికారి అచ్యుతరావు ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు బిపీ, షుగర్ తదితర వైద్య పరీక్ష నిర్వహించారు. చిన్నారులకు కంటి పరీక్షలు చేసి చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అచ్యుతరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి వ్యాధులు సోకవని సూచించారు. పరిశుభ్రమైన మంచినీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. కంజక్టివిటిస్ అనే బ్యాక్టీరియా అలర్జెన్స్ ఇన్ఫెక్షన్ వల్ల కళ్ళు ఎరుపు రంగులో ఉండటం, పుసులు కారటం, కళ్ళు నొప్పి రావడం కనురెప్పలు తెరవకపోవడం, కళ్ళ నుండి నీరు తరచూ కారడం వంటి లక్షణాలు ఉంటాయని, కళ్ళను ఎప్పుడూ నలపరాదని, ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం బాలమ్మ, ఎంఎల్‌హెచ్‌పి లింగేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఎస్ సత్యనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అచ్యుత రావు, వైద్య సిబ్బంది

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని శనివారం తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురవడంతో ముఖ్యంగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు వాహనాలకు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. మంచు ప్రభావంతో ముందు వెళ్లే వాహనాలు సరిగ్గ కనిపించక పోవడంతో వాహనదారులు డ్రైవింగ్ చేసేందుకు అవస్థలు పడ్డారు. ఉపమాక వెంకన్న గరుడాద్రి పర్వతంపై దట్టమైన పొగ మంచు కమ్ముకుంతో భక్తులు ప్రకృతి అందాన్ని ఆస్వాదించారు. గత కొన్ని రోజుల నుండి విపరీతంగా కురవడంతో జీడి, మామిడి పూత దెబ్బతిని, నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆసుపత్రి కార్మికులకు
కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి- మాడుగుల: అనకాపల్లి జిల్లా, ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కంట్రోల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి తక్కువ వేతనం ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ కూడా కాంట్రాక్టర్లు చెల్లించలేదన్నారు. .దీనిపై కార్మిక శాఖఅధికారులకు ఎన్నిసార్లు వినవించు కున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వాయిబోయిన శేఖర్, కార్మికులు పెంటారావు, తాతారావు, కనకం, యల్లమ్మ, చిత్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థి లలితకు అభినందన

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.లలిత ఈనెల 26న విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి పురస్కారం అందుకుంది. ఈ మేరకు శనివారం ప్రిన్సిపల్ సువర్ణ కుమారి, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థి ఎం.లలితను అభినందించారు.రాష్ట్రంలో గల గురుకుల పాఠశాల నుండి ఒక్కొక్క బాలికను ఆ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాడానికి అవకాశం కల్పించారన్నారు. నక్కపల్లి నుండి తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.లలిత ఎంపికై గణతంత్ర వేడుకల్లో పాల్గొని మొదటిస్థానం లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సువర్ణ కుమారి వెల్లడించారు.

జంతు సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ: మానవజాతి మనుగడలో కీలక పాత్ర వహిస్తున్న జంతువుల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. తురువోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎండాకాలంలో పశు పక్ష్యాదులు నీళ్ళు లేక, తిండి లేక ఇబ్బంది పడేటటువంటి అవకాశం ఉంటుందని, కనుక ఇంటి పరిసరాల్లో అవసరమైన నీటి గుంటలు ఏర్పాటు చేయాలన్నారు.పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాధి టీకాలు వేయించాలన్నారు. జంతువులను ఎవరైనా హింసించినా కఠినమైన చట్టాలు ఉన్నాయని చెప్పారు. దేవాలయాలు, వీధుల వంటి ప్రదేశాలలో జంతువులను వధించడం చట్ట విరుద్ధం, గాయ పరచడం నిషేధమన్నారు. . ఈ కార్యక్రమంలో పెదగోగాడ పశు వైద్యాధికారి రాఘవమ్మ, హెడ్ మాస్టర్ రామక్రిష్ణ, పశు వైద్య సహాయకులు రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సాంకేతిక సమావేశాలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మాకవరపాలెం మండలంలో అవంతి కళాశాల ఆవరణలో జరిగిన జాతీయ సాంకేతిక సమావేశం శనివారంతో ముగిసింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సహా వివిధ సంస్థలకు చెందిన జేఎన్టీయూ, ఐఐటి, ఎన్ఐటి, ఈ ఈఈ, ప్రముఖులు హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు భవిష్యత్తుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు, అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఈ నాలుగు సంవత్సరాలలో తీసుకున్న జాగ్రత్తలే భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో అంకితభావంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు, అనంతరం ప్రముఖులను చైర్మన్ శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అరకులోయ: పింఛన్ల పంపిణీని అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అరకులోయ మండలం ఆర్.దుంబ్రిగుడ గ్రామంలో కలెక్టర్ స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి లబ్ధిదారునికి వారి ఇంటి వద్దే పింఛన్ పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మొదటి రోజైన శనివారం సాయంత్రం 4 గంటల సమయానికి 78 శాతం పైగా పింఛన్ పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 1,23,361 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు.మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కుటుంబంలో పింఛను తీసుకునే భర్త చనిపోతే ఆ పింఛను మొత్తాన్ని అతని భార్యకు వితంతువు కేటగిరీ కింద వెంటనే ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. అదేవిధంగా మూడు నెలలుగా పింఛన్ తీసుకోని లబ్ధిదారులకు కూడా రెండు, మూడు నెలల పింఛన్ మొత్తాన్ని కలిపి ఇదే నెలలో ఒకేసారి అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వి.మురళి, ఎంపిడిఓ లవరాజు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌కు 6 బెస్ట్ ఎఫిషియన్సీ అవార్డులు

బెస్ట్ ఎఫిషియెన్సీ అవార్డులతో వాల్తేర్ డిఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఇసిఒఆర్) తన ఉద్యోగుల సేవలు, అంకితభావాన్ని గౌరవిస్తూ భువనేశ్వర్‌లో నిర్వహించిన విశిష్ట్ రైల్ సేవా పురస్కార్ -2024 వేడుకల్లో వాల్తేరు రైల్వే డివిజన్ వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు 6 బెస్ట్ ఎఫిషియెన్సీ షీల్డ్‌ను గెలుచుకుంది. వాల్తేరు డివిజన్‌లోని కమర్షియల్ బ్రాంచ్, సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీ బ్రాంచ్, స్పోర్ట్స్ డిపో, ట్రాక్ మెషిన్ డిపో, మెడికల్ బ్రాంచ్‌లకు బెస్ట్ ఎఫిషియెన్సీ షీల్డులు లభించాయి. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహూ బ్రాంచ్ అధికారులతో కలిసి షీల్డ్‌లను అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వాల్తేరు డివిజన్‌కు చెందిన 16 మంది రైల్వే అధికారులకు విశిష్ట రైల్ సేవా పురస్కారం లభించింది. వీరికి పురస్కారాలను ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షులు కవిత ఫంక్వాల్, అదనపు జనరల్ మేనేజర్ మోహన్ కుమార్ బెహెరా, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బికె.మిశ్రా డిప్యూటీ జనరల్ మేనేజర్ కెకె.ఖదంగా ఇసిఒఆర్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట: విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి రైతులను లూటీ చేస్తూ ఆవు పాల సేకరణ ధరలు తగ్గించిందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని రోలుగుంట సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం రోలుగుంటలో ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణలో 10 శాతం తగ్గించారని, ఇంతకు ముందు నవంబర్‌లో సేకరణ ధర లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించడం జరిగిందన్నారు. ఇలా వరుస పెట్టి పాల రైతులను ఇబ్బందులు పెట్టి నష్టం కలిగిస్తూ నిండా ముంచుతున్నారని చెప్పారు. పెరిగిన పశు పోషణ ఖర్చుల భారం రైతు బరిస్తూ సెంటర్‌కు పాలు పోస్తున్నారన్నారు.రైతు శ్రమతో 1973లో డెయిరీ సహకార సంఘం ప్రారంభమైందని ఉత్తరాంధ్ర ఏడు జిల్లాల నుండి రైతులు విశాఖ డెయిరీకి పాలు పోస్తున్నారని చెప్పారు. డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి మార్చాలని ఆవు పాలు సేకరణపై పరిమితి ఎత్తి వేయాలని తగ్గిన ఆవు పాలు ధర పెంచాలని, సంవత్సరానికి మూడు పర్యాయవారాలు బోనస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక ధర లీటరుకు ఐదు రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.చిలుకు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై విచారణ

ప్రజాశక్తి-నక్కపల్లి

మండల పరిషత్ కార్యాల యంలో శనివారం మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆర్.నరసింహమూర్తి, ఎంపీడీవో డి.సీతారామరాజు, ఎస్ఐ సన్నిబాబులతో కలిసి మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. అదేవిధంగా పలు గ్రామాల నుండి వచ్చిన భూ సమస్యల ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మాడుగుల: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.కోటపాడు గ్రామంలో గుమ్మాల మోహన్‌రావు (48) మద్యానికి బానిసై ప్రతిరోజు పూటుగా మద్యం సేవిస్తున్నాడు. మధ్యాన్ని సేవించవద్దని కుటుంబ సభ్యులు పదే పదే చెప్పేవారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మృతుడు భార్య వరలక్ష్మి హైదరాబాదులో ఉంటున్న తన పిల్లల వద్దకు వెళ్లింది. భార్య కూడా లేకపోవడంతో మద్యం పూటుగా సేవించి చనిపోయాడని పరిసర ప్రాంతాల ప్రజలు పేర్కొన్నారు.మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై నారాయణరావు వద్ద ప్రస్తావించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి-కొత్తకోట: ఆకతాయిల చర్యలతో సుమారు రెండు లక్షల విలువైన సరుగుడు తోట అగ్నికి దగ్ధమైన సంఘటన రావికమతం మండలం కొత్తకోట గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. సరుగుడు తోట మధ్యలో గుర్తు తెలియని ఆకతాయిలు మద్యంతో పాటు లిక్విడ్ గంజాయి సేవించి ఈ దురా ఘతానికి పాల్పడి ఉండ వచ్చునని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామానికి సమీపంలో కొత్తకోట రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 174/5 లో రైతులు కలగర్ల రాధాకృష్ణ, రత్నప్రసాద్‌లకు చెందిన మూడు ఎకరాలు భూమి ఉంది. ఈ భూమి ని మర్రి వలస గ్రామానికి చెందిన మల్ల రమేష్ (కటా రమేష్) ఐదేళ్ళ పాటు లీజుకు తీసుకోని ఉమ్మడి వ్యవసా యం చేస్తున్నారు. అందులో భాగంగా గత రెండేళ్ల కిందట మూడు లక్షల పెట్టుబడితో మూడు ఎకరాలలో సరుగుడు తోట వేశారు. మరో రెండేళ్ల లో పక్వానికి వచ్చే ఈ తోటలో సుమారు ఒక ఎకరా మేర సరుగుడు తోట శనివారం మధ్యా హ్నం 12 గంటల సమయంలో అగ్నికి అహుతి అయింది. ఈ ఘటనకు ముందు గుర్తు తెలియని యువకులు లిక్విడ్ గంజాయి, మద్యం సేవించిన ఆనవాళ్లు ఉన్నాయి. దీనిపై కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కొత్తకోట ఏఎస్ఐ పరిశీలించారు. అనుమానస్పదంగా ఉన్న లిక్విడ్ గంజాయి కాళీ సీసాలను సేకరించారు..

బైక్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె హోటల్ మలుపు వద్ద బైక్ బోల్తా పడిన ఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి సిఐ సుధాకర్ కథనం ప్రకారం..భీమిలి మండలం, చిప్పాడ దివీస్‌లో పని చేస్తున్న విజయనగరం జిల్లా, ఎల్ కోట మండలం,కొట్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్ (25), అతని స్నేహితుడు లోకేష్ మోటారు బైక్‌పై విశాఖ నుంచి బీచ్ రోడ్డు మీదుగా భీమిలి వైపు అతివేగంగా వస్తున్నారు.ప్రదీప్ డ్రైవ్ చేస్తున్నాడు.ఈ క్రమంలో స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె.హోటల్ వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ప్రదీప్, లోకేష్‌లను స్థానికులు 108 లో కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించగా, తీవ్రగాయాలతో లోకేష్ చికిత్స పొందుతున్నాడు. మృతుని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ జి సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మేఘాద్రి రిజర్వాయర్‌లో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్‌లో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. నాతయ్యపాలేనికి చెందిన వి శివరాం(28) మనసు బాగోలేదని మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు వచ్చాడని, అక్కడ నుంచి తన చిన్నాన్నకు ఫోను చేసి, తాను డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన మృతుని చిన్నాన్న వెంటనే శివరాం అన్నయ్యకు ఫోనుచేసి సమాచారమిచ్చాడు. పోలీసులకు సమాచారమిచ్చిన శివరాం అన్నయ్య, మేఘాద్రి రిజర్వాయర్ వద్దకు వెళ్లాడు. గజ ఈతగాళ్ల సాయంతో డ్యాంలో గాలించగా శివరాం మృతదేహం లభ్యమైంది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కాగా ఇటీవల మూడు పెళ్లిసంబంధాలు చూసినప్పటికీ, అవి ఫెయిల్ కావడంతో మనస్తాపంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పెన్షనర్ల సమస్యలపై దశలవారీ ఆందోళన

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : పెన్షనర్ల సమస్యలపై దశల వారీ ఆందోళన చేయనున్నట్లు చిట్టివలస ప్రాంత ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు దామోదర బాబాజీ, అప్పారావు ,సహాయ కార్యదర్శి ఎం అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్య నారాయణ స్పష్టం చేశారు. శనివారం స్థానిక జిఆర్ భవన్‌లో సంఘ సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పింఛను మొత్తాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు . పింఛనుదారుల సమస్యలపై ఆ నెల 11, 12, 13 తేదీల్లో ఢిల్లీలో, 11,12 తేదీల్లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. 11న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. సంఘం నాయకులు కె రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు
'విశాఖ' పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్రజాశక్తి- వేపగుంట : సౌత్‌జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు గోపాలపట్నం విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపికయ్యారని కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ తెలిపారు.కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన తమ కాలేజీ విద్యార్థులు ఎస్.సులోమణి, ఎన్.భాగ్యలక్ష్మి, ఎన్.దేవి సౌత్ జోన్‌కు ఎంపికయ్యారన్నారు. వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ, ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ జివి ప్రదీప్ వర్మ, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ పి.ప్రసాద్.అభినందించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రసాద్, పి.రాజకుమార్, సతీష్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్.కుశరాజు, ఎస్.రూపాలను కాలేజీ చైర్మన్ భినందించారు.

ఆదిత్యుని భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - అరిలోవ : రథసప్తమి సందర్భంగా ఈనెల 3వతేదీ సోమవారం మధ్యాహ్నం నుంచి 5వ తేదీ బుధవారం వరకు రెండురోజులపాటు అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం ప్రసాదం, అన్నదానం చేపడుతున్నట్లు ఉపకార్ ట్రస్ట్ చైర్మన్, ఎపి ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు, సినీ నిర్మాత, డాక్టర్.కంచర్ల అచ్యుతరావు అన్నారు.

శ్రీకాకుళం చాత్తాద వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పాలు, టీ, కాఫీ, ఉప్మా, చక్రపొంగలి, మజ్జిగ, పులిహోరా, మంచినీరుతోపాటు ప్రత్యేక కౌంటర్ల వద్ద తేన్నప్రసాద వితరణ చేపడతామన్నారు.దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామన్నారు. చాత్తాద వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో అందించే అన్నప్రసాదాలను ఆదిత్యుని దర్శనికి వచ్చే భక్తులు స్వీకరించాలని కంచర్ల అచ్యుతరావు కోరారు.

కల్పనా చావ్లాకు ఘననివాళి

ప్రజాశక్తి -తగరపువలస : అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారతీయ మహిళ కల్పనా చావ్లా వర్ధంతిని శని వారం భీమిలి మండలం, సింగన బంద పంచాయితీ, కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో నిర్వహించారు. కల్పనాచావ్లా అద్వితీయమైన అంతరిక్షయానాన్ని గురించి విద్యార్థులకు హెచ్ఎం జి.సత్యనారాయణ వివరించారు

గీతం ఆధ్వర్యాన వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- మధురవాడ : ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, విపత్కర పరిస్థితులలో మానసిక ఆందోళనలకు గురి కాకుండా వ్యవహరించాల్సిన పద్దతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్‌ఆర్‌సి)లను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలలో ఏర్పాటు చేసినట్లు గీతం ప్రాజెక్ట ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం గడబూరు, కోనం, కుండెంపూడి గ్రామాలలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 850 మంది గిరిజనులకు వైద్యసేవలు అందించారు. డిఎస్‌టి నిపుణులు డాక్టర్ కొంగ గోపికృష్ణ పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా సిఆర్‌ఆర్‌సిలను ఏర్పాటుచేసి, స్థానికులకు వైద్యసేవలతోపాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ మాట్లాడుతూ, గిరిజన గ్రామాలలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం పట్ల అవగాహనకు, ఉచిత వైద్యసేవలకు ఆరోహన్ ట్రైబల్ సొసైటి, కృషి విజ్ఞాన కేంద్ర, రోటరీ విశాఖ పెరల్ సిటి సంయుక్తంగా జిమ్‌సర్ ఆసుపత్రి వైద్యులతో కలసి పనిచేస్తోందన్నారు. వైద్య శిబిరం నిర్వహణకు జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి సహకరించారు.

ప్యాకెట్లను అందజేస్తున్న నేతలు

జాన్‌రాజ్‌కు ఉద్యోగ విరమణ ఆత్మీయ సత్కారం

విశ్రాంత న్యాయమూర్తి జాన్‌రాజ్ దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం సబ్ డివిజనల్ మొబైల్ మెజిస్ట్రేట్ జాన్‌రాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఆర్క్ రిసార్ట్స్ వీడ్కోలు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. స్థానిక ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మొబైల్ మెజిస్ట్రేట్ బార్ అసోసియేషన్ రంపచోడవరం సభ్యులైన న్యాయవాదులు కోలా సత్యప్రసాద్, ఎంవిఆర్ ప్రకాష్, భగవాన్, చుక్క సంతోష్ కుమార్, యం.బాల సత్యనారాయణ, జిలాని, కొమ్మిశెట్టి బాలకృష్ణ, భజన వెంకటేశ్వర్లు, శివరంజని తదితరుల ఆధ్వర్యంలో జాన్‌రాజ్ దంపతులను గజమాల, సాలువతో ఘనంగా సన్మానించారు. గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పూలమాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా జాన్‌రాజ్ మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులకు వివిధ కేడర్లో సేవలు అందించడం చలా సంతోషానిచ్చిందని చెప్పారు. ఏజెన్సీలోని గిరిజనులకు మంచి సేవలు అందించే ఏ అధికారికైనా, ఏ సిబ్బందికైనా మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. తను పని చేసిన అన్ని కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది సహకరించారని, వారికి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి, సబ్ కలెక్టర్‌కు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ, పిహెచ్‌ఓ కే చిట్టిబాబు, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్లు వీరవత్తుల రవీంద్రబాబు, కె.విశ్వనాథ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ బి కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు జె.విలన్టన్ బాబు, వీరబ్రహ్మం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'చౌకబారు ఆరోపణలు మానుకోవాలి'

ప్రజాశక్తి- సీతమ్మధార : తనపై అవాస్తవ, చౌకబారు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలకు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం సీతంపేటలోని జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీకి కార్యకర్తలు లేని సమయంలో తాను ఆస్తులను అమ్ముకుని, కోట్లు ఖర్చుపెట్టి, వైసిపి బలోపేతానికి కృషిచేశానని, తీరా అధికారంలోకి వచ్చాక తన రాజకీయ భవిష్యత్‌ను ఆపార్టీ సమాధి చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనను పిలిచి, రాజకీయ పునరుజ్జీవం కల్పించారన్నారు. తాను పబ్‌లు, లిక్కర్ దుకాణాలు, ఫుడ్‌కోర్టుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు అసత్య ఆరోపణలు చేసిన వారిపైనా,ఆయా కథనాలను ప్రచురించిన పత్రికలపైనా న్యాయసహాయాన్ని ఆశ్రయిస్తానన్నారు. అవినీతి, అక్రమాల్లో కూరుకపోవడంతోపాటు రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిన వైసిపిని చిత్తుగా ఓడించి ప్రజలు బుద్ధి చెప్పినా, వారి గుణం మారలేదని ఎద్దేవా చేశారు.

వైసిపి నేత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు బంక రామసత్యం సతీమణి సూర్యనారాయణమ్మ పెద్దకర్మకు భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరయ్యారు. బంక రామసత్యాన్ని పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, సర్పంచ్ గన్‌రెడ్డి శ్రీనివాసరావు, మరుపిల్ల చిన్నయపాత్రుడు, మజ్జి వెంకటరావు, బోని అప్పలనాయుడు, పలువురు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల విశాఖ నగరంలో వెలుగు చూసిన క్రికెట్ బెట్టింగ్ ముఠాకు సంబంధించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ కమిషనరేట్ పరిధిలోని సిటీ టాస్క్ ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా పెద్ద వాల్తేరు డాక్టర్స్ కాలనీ గాయత్రీ టవర్స్‌లో ఒక ఇంటిపై దాడి జరిపి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని నుంచి ఒక ల్యాప్ టాప్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న 80 బ్యాంక్ అకౌంట్లను గుర్తించి వాటిలో ఉన్న రూ.45 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. ఈ అకౌంట్లను పరిశీలించగా రూ.178 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించామని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన బుకిని సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం విధితమే.

సినీ ఫక్కీలో చోరీ : మహిళ అరెస్టు

ప్రజాశక్తి -కొత్తకోట: ఆటోలో వెళ్తున్న వృద్ధురాలిని ఏమార్చి సినీ పక్కీలో రూ. లక్ష నగదును కాజేసిన మహిళను 24 గంటలు గడవకుండానే కొత్తకోట పోలీసులు అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు. దీనికి సంబందించి కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.
దొండపూడికి చెందిన గంపా సత్యవతి శుక్రవారం స్థానిక స్టేటు బ్యాంకులో తన ఖాతాలోంచి రూ. లక్ష నగదును డ్రాచేసి బ్యాగులో పెట్టుకొని నక్కపల్లి మండలం ఉద్దండపురంలోని బందువుల ఇంటికి వెళ్లేందుకు దొండపూడిలో ఆటో ఎక్కింది. ఆ ఆటోలో అప్పటికే గుర్తు తెలియని మహిళ ఉంది. బొడ్డేపల్లి వెళ్లేందుకు వృద్ధురాలు ఆటో ఎక్కగా రోలుగుంట మండలం నిండుగొండ జంక్షన్ వెళ్లే సరికి అర్జెంట్ పని ఉందని ఆటో డ్రైవర్‌తో చెప్పి వృద్ధురాలిని దింపించింది. అదే ఆటోలో ఆమె వెళ్లి పోయింది. అనుమానం వచ్చి వృద్ధురాలు బ్యాగును తెరిచి చూడగా దాంట్లోని రూ.లక్ష నగదు కనిపించలేదు. బ్యాగును బ్లేడుతో కోసి దాంట్లోని నగదును తస్కరించి పట్టుకు పోయినట్టు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు. నగదు చోరీపై వృద్ధురాలి ఫిర్యాదు మేరకు బృందాలుగా గాలించిన పోలీసులు, వి.మాడుగులకు చెందిన మహిళ నగదును చోరీ చేసినట్టు గుర్తించి, శనివారం ఆమెను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అప్పగించారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లోనూ, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు విలువైన వస్తువులు, నగదు ఉంటే అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న డిటి సత్యనారాయణ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం జీకే వీధి పంచాయితీ పరిధి మారుమూల గుమ్మలగొంది యంపిపి పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, పలకలు, పెన్నులు, అక్షరమాల టేబుల్ షార్ట్స్ శనివారం రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు దుమంతి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలగొందికి పాఠశాల లేదని, అక్కడ నుంచి నాలుగు కిలోమీటర్లు కాలినడకన జీకే.వీధి వచ్చి విద్యార్థులు చదువుకోడానికి కష్టతరంగా మారిందని, ఎంఈఓ చొరవతో గుమ్మలగొందిలో తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసి విద్యా వాలంటీర్ ద్వారా విద్యాబోధన చేయిస్తున్నారని తెలిపారు. వారికి మధ్యాహ్న భోజన పథకం అందుబాటులో లేదన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేసినట్లు చెప్పారు. ఆ గ్రామానికి మరోసారి వెళ్లి విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు.